## కల్వకుర్తి అవినీతిలో

# వెలుగు చూసింది ఉల్లి పొట్టంతే

## సీనరేజీ సొమ్ము రూ.కోట్లలో మాయం: తెదేపా

**మహబూబ్‌నగర్, న్యూస్‌టుడే:** కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలో విజిలెన్సు, ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారులు బయటపెట్టిన అవినీతి ఉల్లిగడ్డ పొట్టంతేనని తెదేపా నేతలు నాగం జనార్దన్‌రెడ్డి, మందా జగన్నాథం, రావుల చంద్రశేఖర్‌రెడ్డిలు పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టుల్లో జరుగుతున్న అవినీతిపై తెదేపా ఇచ్చిన సమాచారంతో పరిశీలించినా వందల కోట్ల రూపాయల అవినీతి బయటపడుతుందని సూచించారు. మూడేళ్ల నుంచి పార్టీ చేస్తున్న పోరాటానికి ఇప్పటికైనా విజిలెన్స్ విభాగంలో స్పందన వచ్చిందన్నారు. ప్రాజెక్టుల్లో చేపట్టే నిర్మాణాలకు వినియోగించే ఇసుక, కంకరకు సీనరేజీని కూడా కాంట్రాక్టర్లు చెల్లించడం లేదని ఆరోపించారు. అన్ని ప్రాజెక్టుల్లోనూ సీనరేజీతో వందల కోట్లు స్థానిక సంస్థలకు రాకుండా పోతున్నా, ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. శుక్రవారం మహబూబ్‌నగర్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. కల్వకుర్తి, ఎల్లంపల్లి ప్రాజెక్టుల్లో అవినీతి విపరీతంగా ఉన్నట్టు లోకాయుక్త, విజిలెన్స్ విభాగానికి కనిపిస్తున్నా ముఖ్యమంత్రికి కనిపించకపోవడం విడ్డూరమన్నారు. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా చర్య తీసుకోవడం లేదని, ఈసారి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో కళ్లకు కట్టినట్టు చూపించడానికి సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. సాగునీటి ప్రాజెక్టులను కూడా మంచినీటి పథకాలుగా చూపించి కాంట్రాక్టర్లు రూ.140 కోట్లకుపైగా ఎక్సైజ్ డ్యూటీ మినహాయింపు పొందుతున్నారని ఆరోపించారు. 98.01 నోటిఫికేషన్ నిబంధన ప్రకారం రీసైక్లింగ్‌తో నీటిని సరఫరా చేసే మోటార్లకు మాత్రమే ఎక్సైజ్ డ్యూటీ మినహాయింపు ఉండగా, సాగునీటి ప్రాజెక్టులకు తెస్తున్న వాటికీ కేంద్ర ఎక్సైజ్ పన్ను మినహాయింపు పొందడం సమంజసం కాదన్నారు.